
# కసాబ్‌గల్లీలో సేమ్యాల ముగ్గు



రంజాను నెల వచ్చిందంటే మా కసాబ్‌గల్లీ కళ చెప్పనలవిగానిది.

రోళ్లు పగిలే ఎండల్లో నోట్లోని ఉమ్మి కూడా మింగకుండా వక్కపొద్దు లుంటా- ఎప్పుడూ నమాజు చేయని ఆడోళ్లు కూడా అయిదు పూటలా నమాజులు చేస్తా- సాయింత్రమైతే చాలు సముద్రం మీది నుంచే మల్లే చల్లటి గాలిలో కబుర్లు చెప్పుకుంటా- వీదిలోకి సోడాబండ్లొస్తే సోడాలు తాగతా- తియ్యటి వాసనల మల్లెపూల బుట్ట లొస్తే గీచిగీచి బేరాలు చేస్తా- పిలకాయలమందరం కరెంటు స్తంబాల కింద ఆడుకుంటా- దర్జీ సులేమాను గాడు హిందీ పాటలు పెట్టి రాత్రంతా గుడ్డలు కుట్టుకుంటా... ఆ నెలంతా మా వీదిలో పగలూ రాత్రికి తేడాలా.

ఎందుకని తేడాలా అంటే వక్కపొద్దు వుండటానికి చీకటితో లేచి 'సహర్' చేయాలి కదా. సహర్ చేయాలంటే అన్నం ఒండుకోవాలి కదా. అందుకని రాత్రి పదకొండు

దాటినాక మా వీదిలోని యిళ్లల్లో పొయ్యిలు వెలిగేవి. అంత రాత్రప్పుడు 'సుయ్ సుయ్' మంటా తిరగమాత శబ్దాలు వినిపించేవి.

పొగలు కక్కే పొయ్యిలెదురుగా కూచొని 'సహర్' వంట చేస్తానే కొందరు ఆడోళ్లు వాళ్ల మొగోళ్లతో 'కుదువపెట్టిన కమ్మలు ఈ పండక్కయినా విడిపించరాదా' అనో 'పిలకాయలకు బుస్‌కోట్లు కుట్టిస్తానన్నావు. అదయినా వుందా లేదా' అనో డిమాండింగులు చేస్తా వుండేవాళ్లు.

ఈ వంటతో డిమాండింగులతో ఎప్పుడో పన్నెండు గంటలకు పొణుకుంటారా? మళ్లా తెల్లారి నాలుగ్గంటలకే గణగణమని గంటల మోత మొదలు!

'సహరుకు టైమయింది... అమ్మలారా లేవండి. నాయినలారా లేవండి' అంటా మా మసీదు మౌజను సాహెబు గంట మోగిస్తా గడప గడపనీ నిద్ర లేపేస్తాడు. దెబ్బకు అన్ని యిళ్లల్లో లైట్లు వెలిగి వీది వీదంతా పట్టపగలైపోయేది.

రంజాను నెలలో మా వీది స్పెషలంటే సేమ్యాలే. మా పండక్కి తప్పనిసరి అవి. చేతి మిషనీలని మంచం కోళ్లకి బిగించి, వాటికి అటో కాలూ యిటో కాలూ వేసి మా వీది ఆడోళ్లు యమా నైసుగా తిప్పేవాళ్లు సేమ్యాలని.

తిప్పినాక వీదిలో మంచాలు పరిచి, బోర్లించిన చేటల మీద పచ్చి సేమ్యాలని ఎండ పెడతా వుంటే, తెల్ల తెల్లగా... నగిషీలు నగిషీలుగా... మా యిళ్ల ముందర ముగ్గేసినట్టుగా వుండేయవి.

నెల గడస్తా వుంటే ఒకో రోజు ఒకో యింట్లో సేమ్యాల అడావిడి. ఒకో రోజు ఒకో యింటిలోనే సేమ్యాల అడావిడి ఎందుకురా నాయినా అంటే దానికో లెక్కుంది. మా వీదిలో వుండేది రెండే రెండు సేమ్యాల మిషనీలు. (మనుబూలు చేసే పెద్ద 'చిట్ల'కు గుండ్రంగా తిరిగే హ్యాండిలు తగిలిస్తే ఎట్టుంటుందో అట్టా వుంటుంది సేమ్యాల మిషనీ రొంత పెద్దగా).

ఒకటి జాఫరయివోరి యింట్లో.

యింకొకటి ఖాదర్‌బీ యింట్లో.

వీళ్లిద్దరూ వీళ్లకు కావల్సినోళ్లకు మాత్రమే వంతులవారీగా మిషనీలిచ్చేవారు గానీ పొరపాటున కూడా యింకొకరిని తాకనిచ్చేవారు కాదు. అయితే మా అమ్మ ఎట్ట న్యాక్ చేసిందోకానీ ఆ సమచ్చరం ఖాదర్‌బీకు కావలిసినోళ్ల లిస్టులో చేరి పోయింది. దాంతో మాక్కూడా సేమ్యాలు తిప్పుకునే వంతొచ్చింది.

ఆడ మొదలయ్యింది కత!

మా యింట్లో సేమ్యాలు తిప్పడమంటే మా పెద్దప్పు నాయిన పుణ్యమా అని పదిళ్లలో సేమ్యాలు తిప్పడంతో సమానం. మా యింట్లో ఏదైనా పని మొదలుపెడితే చాలు మా నాయిన పెట్టే నస ఒక రకమైనది కాదు. సేమ్యాలు తిప్పే పనికైతే యింక చెప్పనేబల్లా.

'పని నీటుగా చేయండి మే. పిండి ఒకటికి నాలుగుసార్లు జల్లెడ పట్టుకోండి. సేమ్యాలు మొరటుగా వుండేదానికే లా. సన్నగా వుంటేనే ఎమ్‌డన్‌గా వుంటాయి' అని ఆ రోజు పని మొదలుపెట్టక ముందే తగులుకునేశాడాయన.

అంతటితో వదలకుండా మా అమ్మ చుట్టే తిరగతా 'పచ్చి సేమ్యాల మీద దుమ్ము పడిందంటే నోట్లో పెట్టలేము అమ్మలాలా. మీకు పుణ్యముంటుంది... యింట్లో ఫ్యాను కిందే ఆరపెట్టండి' అని జాగ్రత్తలు చెప్పడం మొదలు పెట్టినాడు (వాటిని రెడ్లకు పంచాలి కదా. అదీ ఆయన బాధ).

మా నాయిన పోడు పడలాక మా అమ్మ సలాము పెట్టేసి 'నువ్వు పనికిపో నాయినా. మా తిప్పలేవో మేము పడతాము' అనింది.

మా నాయిన కదల్లా. పిండిని జల్లెడ పట్టేదాకా వుండి, ఇత్తడి పళ్లెంలో ముద్దచేసే దాకా చూసి అప్పుడు కదిలినాడు. పోతా పోతా 'మద్యానానికల్లా తిప్పెయ్యండిమే... పని మొదలుపెడితే ఆగకూడదు' అని ఆర్డరేసి పోయినాడు.

ఆయన కదిలినాక, మా నాయినమ్మ శుద్దంగా తలకుపోసుకొని, తెల్లటి కాటను చీర కట్టుకొని సేమ్యాల పనికి పిండి ముందర కూచునింది.

అప్పటికే మా అన్నా నేనూ ఇస్కూలు ఎగనూకి సేమ్యాలు ఆరబెట్టేదానికి రెడీ అయిపోయినాం. మనిషి సాయానికి మా యిల్లుగల్లామైన జైబూన్ ఆపా కూడా వచ్చి కూచునింది.

అప్పుడు మొదలయ్యింది జజ్జనక.

మిషినీకి వెళ్లిన మా అమ్మ ఉత్త చేతులు ఊపుకుంటా వచ్చి ఉసూరుమంటా కూలబడింది. 'యిప్పుడెట్ల చేసేదమ్మా. మిషినీ లేదంట కదా' అనింది, బిక్కమొకం వేసుకుంటా.

మా నాయినమ్మ బిత్తరపొయ్యింది.

'అదేంది మే. యివాళ మనకిస్తానంది కదా ఖాదర్‌బీ' అని అడిగింది.

'అవునుగదమ్మాయా. యివాళ మీ వంతుకదా' అనింది జైబూన్ ఆపా కూడా.

'అదెవుత్తో సవితి కచ్చేరిమిట్ట నుంచి వూడిపడిందంట. మిషినీ కావాలని బలవంతం చేసిందంట. పినమ్మ కూతురుకదా... యియ్యకపోతే బాగుండదని యీ మహాతల్లి యిచ్చి పంపించిందంట. కావాలంటే రేపిస్తానంటా వుంది' అని ఖాదర్‌బీని తిడతా నెత్తి కొట్టుకునింది మా అమ్మ.

ఏమి చేయాలో మా నాయినమ్మకి పాలుపోలా. మా నాయిన్ను తలుచుకునే సరికి ఆమెకు దడ పట్టుకునింది. మా అమ్మకు ఏడుపొక్కటే తక్కవ.

'యీ సంగతి ముందే తెలిసుంటే పిండయినా కలుపుకోకుండా వుండేవాళ్లం. ఆ మనిషి అంతా కళ్లారా చూసుకొని పోయినాడు. సాయింత్రానికి వచ్చి 'సేమ్యాలు ఏవి మే' అని అడిగితే నేనేమని సమాదానం చెప్పేది? ఆ తల్లి వల్ల పిండి పొయ్యింది. ఈ మనిషి చేతిలో చావొచ్చింది' అనింది మా అమ్మ.

కోపమొచ్చిందంటే మా నాయిన ఆడే ఆట జైబూన్ ఆపాకు కూడా తెలుసు కాబట్టి ఆమె కూడా గాబరా పడింది. 'జాఫరోళ్లదన్నా తెద్దామంటే యివాళ మస్తానోళ్ల వంతంట. వాళ్లింట్లో సేమ్యాలు తిప్పుతా వున్నారు. ఎట్ల చేద్దాం' అనిందామె.

మా నాయినమ్మ గమ్మున అయిదు నిమిషాల సేపు ఆలోచించింది.

వెంటనే టక్కున లేచి నిలబడింది.

కుర్చీ ఎక్కి, అటక మీదున్న పట్టె మంచం బల్లలు కిందకు దించింది. వాటిని బావి దగ్గిరకి తీసకెళ్లి సుబ్బరంగా కడిగింది. ఆనేక పాడిచీరతో తుడిచి వాటిని అటూ ఇటూ తడిమి చూస్తా 'ఇవే మన మిషినీలు' అనింది.

మా అమ్మకు అర్థమైపోయింది.

'చేతి సేమ్యాలా?' అనింది ఆచ్చుర్యంగా.

'ఈ కాలంలో చేతి సేమ్యాలు ఎవరు చేస్తా వున్నారు తల్లా. చాలా టైము పట్టే పని కదా' అనింది జైబూన్ ఆపా కూడా.

'మా నస్లిహరామోడి చేతిలో తప్పించుకోవాలంటే ఇంతకు మించి వేరే దారిలా. అయినా ఎంత సేపనా. ముగ్గురం మూడు వైపులా కూచుంటే?' అనింది మా నాయినమ్మ.

తన్నులు తినడం కంటే యీ పనే మేలనిపించి 'సరే' అనింది మా అమ్మ. జైబూన్ ఆపా కూడా 'అట్నే కానీండి' అనింది బొడ్లో కొంగు దోపుకుంటా.

యింకంతే. ఆ ముగ్గురాడోళ్లకు తిండీలా. నీళ్లులా. మూడు మంచాలకు మూడు నిలువులుగా బల్లలేసి, చీరలు పైకిలాక్కొని కూచుని, నిమిషానికొకసారి అరి చేతులకూ

బల్లలకూ నూనె రాసుకుంటా, నడుము వొంచి పిండి రుద్దతా వుంటే నాయినా... దూదిలో నుంచి దారం దిగినట్టు పిండిలో నుంచి సన్నటి సేమ్యాల పోగులు!

వాళ్లకి అంత పట్టూ అంత బలమూ యాణ్ణుంచి వచ్చినాయోగాని మద్యానానికల్లా జబ్బలు అదిరిపోయేలా పిండి రుద్దీరుద్దీ ముప్పయి చేటల సేమ్యాలు ఆరబెట్టేసినారు.

అంతపనీ ముగించినాక ముక్కుల మీది నుంచి కారే చెమటలు తుడుచుకుంటా, రొమ్ముల మీద పయిటలతో విసురుకుంటా వాళ్లు బల్లల మీది నుంచి లేచిన కాసేపటికి యింటికి వచ్చినాడు మా నాయిన.

రావడంతోటే గబాల్న చేటల తట్టు చూసినాడు.

వాటి మీదున్న తెల్లటి సేమ్యాలనీ వాటి మెలికల మెలికల అల్లికనీ తృప్తిగా చూసుకుంటా 'బలే వుండాయిమే సేమ్యాలు. ఎవురి మిషనీలో తిప్పారేంది?' అని మురిసిపోతా వుంటే అంతసేపూ పడిన కష్టానికి కారకుడైన ఆ మగమహారాజుని చూసి, ఏడవలాక నవ్వి, దండం పెట్టినారు ఆ ముగ్గురు ఆడోళ్లు!

